అన్నమయ్య సారస్వత క్షీర సాగరం!

# ముత్యాల కొంగు

పల్లవి :

కొమ్మ తన ముత్యాల కొంగు జారఁగఁబగటు
కుమ్మరింపుచుఁ దెచ్చుకొన్నదీ వలపు

చరణాలు :

ఒయ్యారమున విభుని వొరవు గనుఁగొని రెప్ప
ముయ్య నేరక మహా మురిపె మునను
కయ్యంపుఁ గూటమికి ఁగాలు దువ్వుచు నెంత
కొయ్య తనమునఁ దెచ్చుకున్నదీ వలపు.

పైపైన అరగింపుము పన్నీరు గడు
తాప మవునని చెలులు దలఁకగానే
తోపు సేయుచుఁగెంపు దొలఁకు ఁగన్నుల కొనల
కోపగింపుచు ఁదెచ్చుకొన్నదీ వలపు.

ఎప్పుడునుఁ బతితోడ నింతేసి మేలములు
ఒప్పదని చెలిగోర నొత్తఁగానే
యెప్పుడో తిరువేంకటేశు కౌఁగిటఁ గూడి
కొప్పు గులుకుచుఁ దెచ్చుకొన్నదీ వలపు.

శృంన. రేకు. 13 సం. XII74]

కొంగు ముడి విప్పే ముడుపులు చెల్లిస్తేనే వడ్డికాసుల వాడు పలికేది. నిలువు దోపిడి మీదనే వెంకన్నకు మక్కువ. మధుర భావనతో సర్వాత్మనా అర్పణం చేసుకొన్నప్పుడు తిరుమల శృంగార నాయకుడు జీవనాయికలకు సాయుజ్యాన్ని ప్రసాదిస్తాడు. అన్నమయ్య శృంగార నాయిక అధ్యాత్మ వీథులలోనే విహరిస్తుంది.

ఈ వలపు ముక్తిధామానికి తలపు.

నాయిక ముత్యాలకొంగు విప్పి తన లావణ్యాన్ని నాయకుని ఎదుట కుమ్మరించి తెచ్చుకొన్న దీ వలపు.

ఒయ్యారంగా విభుని అందాన్ని ఆస్వాదించి అనిమిష అయి, వివశ అయి, మదనకదన దోధూయమాన మానస అయి మొండిగా పెంచుకొన్నదీ వలపు.

ప్రియుని సంయోగం కోసం తపిస్తూ దాహం తీర్చు కోవాలని పన్నీరు త్రాగబోయి చెలులు వారిస్తే వాళ్ళ నదిలిస్తూ కళ్ళలో నిప్పులు కుమ్మరిస్తూ కోపగించుకొని తెచ్చుకొన్న దీ వలపు.

భర్తతో ఎప్పుడూ ఇటువంటి పరిహాసాలు మంచివి కావని చెలికత్తెలు గోరగీరి సైగ చేయగానే ఎప్పుడో శ్రీవారి కౌగిట్లో చేరి కొప్పు కులుకుతూ తెచ్చుకున్న దీ వలపు.

[ప] కొమ్మ : స్త్రీ. కోమలత్వాన్ని సూచించే స్త్రీ పర్యాయ వాచకం. నాయిక - జీవనాయిక. ముత్యాల కొంగు : ముత్యాలు అందంగా అంచులకు కుట్టినది. ఆ స్త్రీ ఐశ్వర్యాన్ని తెలుపుతుంది. పగటు : లావణ్యం. యౌవనాతిశయ ప్రదర్శన. 'కొంగు జారిన మెరుగు గుబ్బ లొలియగ తరుణీ...'[పలుకు తేనెల తల్లి].

[1] వొరవు [ఒరవు] ఒఱవు : సౌందర్యం. మురిపెము : మురియు భావార్థకం. ఒడలు విరుచుకొనుట 'ప్రియం స్మృత్యా సాంగభంగ విజృంభణం' 'మోట్టాయితం' అష్టా దశ శృంగార చేష్టలలోనిది. కయ్యంపు కూటమి జగడము తోడి సాంగత్యం.ప్రేయసీ ప్రియులమధ్య సాగే తంతు. కాలుదువ్వుచు : పోట్లాటకు దిగడం. 'కయ్యానికి కాలు దువ్వడం' కొయ్యతనము : మొండితనం.

[2] తలఁకు : భయపడు. చెలులు వద్దని వారించడం. చెలులు వారించారని కాదు విభుడు చేరదీయలేదనే కోపం. కెంపు...కొనల : కోపం వస్తే కళ్ళు ఎర్ర బడతాయి,కెంపులౌతాయి.

[3] మేలము : పరిహాసం. వల్లభుడు అలుగు తాడని చెలికత్తె గోరగిల్లి సైగ చేయడం.

కామిశెట్టి శ్రీనివాసులు

---

## మినీ కథ
# పొరుగింటి...

- మల్లాది లక్ష్మి

**మధు**, రాజు, గోపి - ముగ్గురూ ఎం.ఎ్స్సి కెమిస్ట్రీ కలిసి చదివారు. మధు ఒక ఊళ్ళో లెక్చరరుగా స్థిరపడి, తలిదండ్రులు ఎన్నిక చేసిన ఫిజిక్స్ లెక్చరర్ వసంతను పెళ్ళి చేసుకున్నాడు. రాజు ఇంకో ఊరులో ఉద్యోగం చేస్తూ తలి దండ్రుల బలవంతం మీద పెద్దగా చదువుకోని రుక్మిణిని .చేసుకున్నాడు.

ఇక మిగిలింది గోపి. అతనికి సంబంధాలు వస్తున్నాయి కాని, ఎలా ఎన్నుకోవాలో తెలీలేదు. స్నేహితుల అభిప్రాయాలు సేకరించి, వారి సహాయం తీసుకో దలచుకున్నాడు.

మధు దగ్గర కెళ్ళి సంసార జీవితం ఎలా ఉందో అడిగాడు.

దిగులుగా అన్నాడు మధు- "ఏంటో గురూ, సమాన స్థాయిలో చదువుకున్న అమ్మాయిని చేసుకుని పొరబాటు చేశాననిపిస్తూంది. ఇంటి కొచ్చాక కూడ అదే కాలేజీ కబుర్లు, లెబొరేటరీ పదాలు, నా కోసమే కాక, తన కోసం కూడా ఇంటి కొచ్చే వాళ్ళు జాస్తి. అన్నిటికీ నాతో సమానంగా తయారవుతుంది. భర్త అన్న గౌరవం లేదు. 'నీ మంచి కోసం చెప్తున్నాను. చాకలి పద్దు రాయగలిగిన పిల్లను చేసుకో చాలు. ఇంట్లో నీదే పైచేయి అన్న తృప్తి ఉంటుంది. నన్ను చూడు, ఇన్‌ఫీరియారిటి కాంప్లెక్స్‌తో చస్తున్నాను. రాజు ఎంత అదృష్ట వంతుడో అనిపిస్తుంది."

నిజమే ననిపిచింది గోపికి. మరువారం రాజు దగ్గర్ర కెళ్ళి, అదే ప్రశ్న వేశాడు.

"నీ మంచి కోసం నా మనసులో మాట చెప్తున్నాను గురూ! నా మాట విని బాగా చదువుకున్న పిల్లనే చేసుకో. నాలా జీవితం డల్‌గా చేసుకోకు. కాలేజీ కబుర్లు చెబుదామంటే రుక్మిణికి ఇంట్రెస్టు లేదు. అర్థమై చావదు. సంభాషణలో చురుగ్గా పాల్గొనే చాతుర్యం లేదు. నేనంటే భక్తి గౌరవాలు చూపిస్తుందే కాని, సరదాగా కబుర్లు చెప్పే తెలివి, చనువు లేదు. ఎంత సేపూ ఇంట్లో స్మశాన నిశ్శబ్దం, ఆశ్రమ ప్రశాంతత అనుకో. ఇంటికి రావాలంటేనే విసుగ్గా ఉంటుంది. మధు ఎంత అదృష్టవంతుడో అనిపిస్తోంది." దిగులుగా నిట్టూర్చాడు రాజు.

ఈ సారి దిగులు పడటం, బిక్కమొహం వేయటం గోపి వంతయింది! ★